RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -148 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 5 జులై 2026

# ఉద్యోగాల కేంద్రంగా కుప్పం

## కుప్పాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు

**కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు... వెలికితీస్తాం: సీఎం చంద్రబాబు**

**రూ.118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన**

**కర్నూలు జిల్లా జొన్నగిరి తరహాలోనే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని వెల్లడి**

**గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు, సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసిందని స్పష్టీకరణ**

**అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటే, గొడ్డలి పార్టీ 'మావిగన్' అంటోందని ఎద్దేవా**





**కుప్పం జూలై 4 ఆంధ్ర ప్రగతి**

తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మిగతా 2లో...

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

**యుద్ధం వేళ ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి**

**అయితే సమర్ధంగా సవాళ్లను అధిగమంచగలిగాం**

**రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ**



**జయపుర,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదఅని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, మిగతా 2లో...



# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

**వీరిలో 17 మంది పాక్ పౌరులు, ఆరుగురు భారతీయులు**

**జాబితాలో జైష్, లష్కరే తోయిబా కీలక నేతలు**

**ఉగ్రదాడులు, చొరబాట్లు, నిధుల సమీకరణ, నియామకాల ఆరోపణలు**

**సుంజ్వాన్, నాగ్రోటా దాడులతో సంబంధాలున్నట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

పాకిస్థాన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్-ఎ-మహ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు. మిగతా 2లో...

# జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

**సంఘ విద్రోహ శక్తులనడంలో సందేహం లేదు**

**తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లో ప్రకాశ్ రాజ్ ఆస్కింగ్**

**అక్కడి డబ్బుల కోసం ఇద్దరూ రాష్ట్రంలో ఘర్షణలకు యత్నం**

**డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లక్ష్యంగా ప్రకాశ్ రాజ్ చర్యలు**

**ఘాటు విమర్శలు చేసిన మంత్రి కందుల దుర్గేశ్**

**అమరావతి,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

సినీనటుడు ప్రకాశ్‌రాజ్, కాకినాడకు చెందిన యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ (రావణ్) వ్యాఖ్యలపై మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్ రాజ్, జోసెఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోసెఫ్ సూచనలతో ప్రకాశ్‌రాజ్ స్పందిస్తారని విమర్శించారు. ఇద్దరి మధ్య అనుబంధం ఉందనేందుకు మా దగ్గర ఆధారాలున్నాయి. జోసెఫ్ ప్రశ్నించగానే.. జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మిగతా 2లో...



# వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ అమలు

**వారసత్వ భూములపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..**

**ఇక ఆఫీసుల చుట్టూ తిరగనక్కర్లేదు!**

**రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు**

**మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలకు చెక్**

**రూ.10 లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100**

**వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్‌ఎంసీ తప్పనిసరి**

**అమరావతి,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు అనుమతించిన సర్కార్, తాజాగా మరో కీలక ముందడుగు వేసింది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు మిగతా 2లో...



# సాయికృష్ణ కేసులో మెజిస్టీరియల్ విచారణ

**విచారణకు హాజరైన తల్లీ, కుటుంబీకులు**

**సిఐ నాగరాజు తన కొడుకును మాయం చేశాడన్న తల్లి**



**విజయవాడ,జూలై 4 :** గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి మిగతా 2లో...

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

**జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**



**న్యూఢిల్లీ,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు మిగతా 2లో...

# మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

**జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన**

**ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా**

**ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు**

**సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో**

**అమరావతి,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. మిగతా 2లో...



# కవితకు ఎన్నికల సంఘం షాక్

## టీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్

**అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత**

**అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి**

**హైదరాబాద్,,జూలై 4 ఆంధ్ర ప్రగతి**

కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 2లో...



## 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది. ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది. ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హరూన్ రషీద్ గనాయ్‌తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది. 2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## సాయికృష్ణ కేసులో మెజిస్టీరియల్ విచారణ

మొదటి పేజీ తరువాయి

విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త శనివారం హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసులపై విజయలక్ష్మి సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే చంపేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లామని తెలిపారు. అయితే, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూపకుండా వెనక్కి పంపించారని ఆమె వెల్లడించారు. ఈ కేసులో తమ కుటుంబానికి న్యాయం చేయాలని విచారణాధికారిని విజయలక్ష్మి వేడుకున్నారు. దాదాపు రెండు గంటలకు పైగా మెజిస్టీరియల్ విచారణ కొనసాగింది. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా
చర్చనీయాంశంగా మారగా, మేజిస్ట్రేట్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు కీలకంగా మారనున్నాయి.

----------------

## పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్–కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జులై 5న సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు. జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి. జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది. జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు.
జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.

## కవితకు ఎన్నికల సంఘం షాక్

మొదటి పేజీ తరువాయి

15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

## వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ అమలు

మొదటి పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.

**పాత పద్ధతికి స్వస్తి.. కొత్త విధానం ఇలా**

ఇంతకుముందు, కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది.
తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే 'ఆటో–మ్యుటేషన్' ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి.

**వీలునామా లేకపోతే ఎఫ్ఎంసీ తప్పనిసరి**

అయితే, ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పనిసరిగా ఎఫ్ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు.

**రైతులకు భారీ ఊరట**

గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10 లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100 స్టాంప్ డ్యూటీగా, రూ. 10 లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతో పాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడం కూడా సులభతరం అవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.

## ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

మొదటి పేజీ తరువాయి

విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40–50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25–26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హార్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు. మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

--------------------------

## జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

మొదటి పేజీ తరువాయి

తెరముందు వీళ్లుంటే.. తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. వైకాపా పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారో చెప్పాలన్నారు. పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రశ్నించడం అంటే.. బూతులు తిట్టడం.. వ్యక్తిగత విమర్శలు చేయడమా? ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జరిగే ఈ కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టాలని కందుల పిలుపునిచ్చారు. నటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన ట్వీట్‌పై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేలా కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రకాశ్‌రాజ్‌తో పాటు జోసెఫ్ రావణ్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని విమర్శించారు. ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలపై ప్రకాష్‌రాజ్ ఎందుకు స్పందించలేదని మంత్రి ప్రశ్నించారు. వైసీపీ పాలనలో జరిగిన అకృత్యాలు, హిందూ ఆలయాలపై దాడుల సమయంలో ఆయన ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. అంతేకాకుండా, తాడేపల్లి ప్యాలెస్ నుంచి మీకు ప్రతి నెలా ఎంత డబ్బు అందుతోందని ప్రకాష్‌రాజ్‌ను ఉద్దేశించి మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించి విధ్వంసకర వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో 'జస్ట్ ఆస్కింగ్' అంటూ గొంతు చించుకునే ప్రకాష్ రాజ్‌కు, బూతులు తిట్టే జోసెఫ్ రావణ్‌కు మధ్య అపవిత్ర, అక్రమ సంబంధం ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, చీకటి ఒప్పందాలకు సంబంధించిన పక్కా ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. జోసెఫ్ రావణ్ ప్రమేయం, సూచనలతోనే ప్రకాష్ రాజ్ సోషల్ మీడియాలో స్పందిస్తుంటాడని.. రావణ్ ప్రశ్నించమంటూ లైన్‌లోకి రాగానే, ప్రకాష్ రాజ్ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ తెరపైకి వస్తాడని మండిపడ్డారు. 'నా లింక్ లు ఓపెన్ చేస్తే.. మీకు అసలు మ్యాటర్ అర్థమవుతుంది' అంటూ ప్రకాష్ రాజ్, రావణ్ మాట్లాడుకున్న ఆడియో కాల్ కూడా ఇప్పుడు బయటకు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వీరిద్దరూ కలిసి పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతున్నారని కందుల దుర్గేష్ ఆరోపించారు. ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే, ఈ రాష్ట్రంతో ఎలాంటి సంబంధం లేకపోయినా ప్రకాష్ రాజ్ ఇక్కడ మాట్లాడుతున్నాడని విమర్శించారు. వీరు కేవలం డబ్బు కోసమే కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, మత ఘర్షణల మంటల్లో చలి కాచుకునే నైజం వీరిదని దుయ్యబట్టారు.

## ఉద్యోగాల కేంద్రంగా కుప్పం

మొదటి పేజీ తరువాయి

అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.
మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ–నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

**ఉద్యోగాల కేంద్రంగా కుప్పం**

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

**కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి**

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ–సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019–24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని



హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.
'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన
రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.
కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 5 జులై 2026

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి భావితరాలకు చిరస్మరణీయం. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం

## ..జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా జులై 04:** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా నేడు జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గిరిజనులను సంఘటితం చేసి, వారి హక్కుల పరిరక్షణ కోసం అసాధారణ ధైర్యసాహసాలతో పోరాడిన గొప్ప నాయకుడిగా అల్లూరి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. స్వేచ్ఛ, ఆత్మగౌరవం, దేశభక్తి, త్యాగం వంటి



ఉన్నత విలువలకు అల్లూరి సీతారామరాజు ప్రతీక అని జాయింట్ కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగం, చూపిన అంకితభావం నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తోందని చెప్పారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. నేటి యువత అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారు కలలుగన్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారి సురేష్, ట్రైబల్ వెల్ఫేర్ సలహామండలి డైరెక్టర్ వెంకటపతి, గిరిజన సంఘం నాయకులు కైలాస్ నాయక్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.

## ..జిల్లా టూరిజం అధికారిని కే.విజయలక్ష్మి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 4:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని జిల్లా టూరిజం అధికారిని కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి సందర్భంగా ఆయన



చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ...అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా వెలుగొందారని, అల్లూరి సీతారామరాజు విజయనగరం సమీపంలోని పాండ్రంగిలో జన్మించారని, ఆరవ తరగతి చదువుతున్న వయసులోనే తండ్రిని కోల్పోవడం ఆయన జీవితంలో పెనుమార్పులే తీసుకువచ్చిందన్నారు. కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవారని, జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠ యోగం, కవిత్వం నేర్చుకున్నారని, వీటితో పాటు సంస్కృతం, ఆయుర్వేదం కూడా నేర్చుకున్నారన్నారు. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారని, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేవన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాడిన మహా వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ లో జన్మించడం అందులో మన తెలుగువాడిగా పుట్టడం మనం గర్వించదగ్గ విషయమన్నారు. గిరిజన ప్రజల అభ్యున్నతికి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ళ వయసులోనే అమరవీరుడయ్యాడని తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం తెల్లవారితో పోరాడిన మహావీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుబాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్ డిజిటైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి.

**-30% కంటే తక్కువ డిజిటైజేషన్ ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రక్రియను వేగవంతం చేయాలి. -.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరీ**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 04:** సర్ డిజిటైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. శనివారం సర్ డిజిటైజేషన్ ప్రక్రియ అంశం పై కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఏ పోలింగ్ కేంద్రాల్లో డిజిటైజేషన్ ప్రక్రియ 20, 30 శాతం కంటే తక్కువ ఉందో, సంబంధిత పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక శ్రద్ధ వహించి డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలన్నారు. అదే విధంగా సంబంధిత బిఎల్ఓ లకు కాల్ చేసి వారి పురోగతిని పర్యవేక్షిస్తూ, డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి తీసుకొని రావాలన్నారు. బుక్ ఏ కాల్ కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటైజేషన్ ప్రక్రియలో 0 శాతం చేసిన బిఎల్ఓ లపై




ఆర్ పి యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈఆర్ఓ లను ఆదేశించారు. సర్ ప్రక్రియలో పురోగతి సాధించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు మండలాల్లో సర్ ప్రక్రియ బాగా చేశారన్నారు. శనివారం, ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ లు నిర్వహించనున్న సందర్భంగా ఈ రెండు రోజుల్లో డిజిటైజేషన్ ప్రక్రియ 10 శాతం పైగా సాధించాలని కలెక్టర్ ఈఆర్ఓ లను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ 20% కంటే తక్కువ ప్రోగ్రెస్‌లో ఉన్న బి ఎల్ ఓ లతో, 20% కంటే ఎక్కువ ప్రోగ్రెస్ ఉన్నప్పటికీ, ఆ రోజు 3% కంటే తక్కువ పని చేసిన బి ఎల్ ఓ లతో సమీక్ష నిర్వహించుకుని డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి తీసుకొని వస్తున్నామన్నారు. వీఆర్వో , ఏ ఈ ఆర్ వో స్థాయిలో అవసరమైన సీరియస్‌నెస్ కనిపిస్తోందని, అయితే కొంతమంది బి ఎల్ వో లు మాత్రం సరిగా స్పందించడం లేదన్నారు. కొంతమంది బి ఎల్ ఓ ల నిర్లక్ష్యం వల్ల పురోగతి ప్రభావితమవుతోందన్నారు. నిర్లక్ష్యం గా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని జేసీ తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో ఈ ఆర్వో లు, ఏఈఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# జులై 6వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం.

**-అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.**

**..అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జులై 04:** ఈ నెల 6 వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు , మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల




పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు **Meekosam.ap.gov.in** (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# రాయలసీమ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం..!

**-వైసీపీది కేవలం దుష్ప్రచారమే.**

**- ఎన్ ఎండి. ఫిరోజ్**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 4:** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా కార్యాలయంలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రాయలసీమ అభివృద్ధి అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రాయలసీమ అభివృద్ధికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో వేగంగా పురోగతి సాధించామని తెలిపారు. భారీ పెట్టుబడులతో అనేక కంపెనీలు రాయలసీమకు వస్తుండగా, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

రాయలసీమ అభివృద్ధిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్న ఆయన, వైసీపీ పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా, కియా, అమర్ రాజా వంటి సంస్థలను




ఇబ్బందులకు గురిచేసి పెట్టుబడిదారుల్లో భయాందోళనలు సృష్టించి రాష్ట్రం నుండి తరలిపోయేలా చేశారని విమర్శించారు. వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితమైన వైసీపీకి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అమరావతి అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన వైసీపీ ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. కూటమి ప్రభుత్వం రాయలసీమతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో రాయలసీమను పరిశ్రమలు, సాగునీరు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపేలా ప్రభుత్వం పనిచేస్తోందని, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కూడా సానుకూల చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాయలసీమ అభివృద్ధి మా ప్రభుత్వ బాధ్యత. ప్రతి రైతుకు నీరు, ప్రతి యువకుడికి ఉద్యోగం, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందించడమే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని ఎన్ ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి సురేష్, మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ అహ్మద్, మాజీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులు బోయ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్, కమిటీ సభ్యులు బింగుమాళ్ళ శ్యామ్ సుందర్, సౌభాగ్య, విజయగౌరీ, విజయ భాస్కర్, దండే నరేష్, పవని తదితరులు హాజరయ్యారు.

# స్వామి వివేకానంద 124 వర్ధంతి- విగ్రహానికి నివాళులు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 04:** నంద్యాల పట్టణ లో కల్పనా సెంటర్ వద్ద ఉన్న స్వామి వివేకానంద 124 వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయనను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ సహాయ కార్యదర్శి నడిగడ్డ మా భాష, నాయకులు షేక్ మా భాష, జమాల్ ,రమేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద నేటికీ యువతకు చాలా ఆదర్శంగా ఉన్నారని ఆయన మరణించిన ఆయన ఆశయాలు మరణించలేదని నేటికీ యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోతున్నారని అదేవిధంగా చదువులో కానీ విజ్ఞానంలో కానీ ఆయన చాలా ముందు ఉండేవారు కొద్ది క్షణంలోనే పది పేజీలు చదివేగల జ్ఞానవంతులు అలాగే ఆయన ప్రపంచ యువతను తన వాక్చాతుర్యంతో ఆకర్షించి యువతను సన్మార్గంలో నడిపించాడు అని, యువత స్వామి వివేకానంద ఆశయాలను ఆచరణలో పెడితే కష్టతరమైన విజయం సొంతం చేసుకోవచ్చని, కానీ యువలోకం చాలా వరకు చెడు అలవాట్లకు బానిసలై సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని సమాజాన్ని సన్మార్గం నడిపించే ప్రయత్నం చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ తెలిపారు.



# మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 04:** నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు శ్రీ సయ్యద్ భాష ఆదేశానుసారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ సాదిక్ భాషా సహకారం తో నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నంద్యాల జిల్లా అధ్యక్షురాలు షేక్ చాందిని సమక్షంలో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి రాయలసీమజోనల్ ఇంచార్జ్ కే. హవిలన్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొనడం అయినది

ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ కమిటీని జిల్లా అధ్యక్షురాలు షేక్ చాందిని జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు సమక్షంలో ప్రకటించడమైనది ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు కశెట్టి కృష్ణమూర్తి డాక్టర్ ఇంటి ఆదినారాయణ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కశెట్టి చంద్రశేఖర్ జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల రవీంద్ర జిల్లా కార్యదర్శి కూరాకు భరత్ కుమార్ మైనార్టీ నాయకులు అందరు కూడా పాల్గొనైనది.

# ప్రతి పంటకు విత్తన శుద్ధి ఎంతో కీలకం.

**ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 04:** పంటల్లో విత్తన శుద్ధి ఎంతో కీలకమని మహానంది ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. టీ. హేమాద్రి రైతులకు సూచించారు. శనివారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో పసుపు పంటలో విత్తన శుద్ధి,సాగు పద్ధతులపై రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి హరేంద్ర మాట్లాడుతూ..రసాయనిక విత్తన శుద్ధిలో మెటలాక్సిల్, మాంకోజెబ్ మందును లీటరు నీటికి 3 గ్రాములు చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలని సూచించారు. విత్తన కాండాలపై పొలుసు పురుగులు



ఉన్నట్లయితే ప్రొఫెనోఫాస్ 50 ఈసీ మందును లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి శుద్ధి చేయాలని తెలిపారు. జీవ శుద్ధి కోసం ట్రైకోడెర్మా విరిడే, ఫ్సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ మందులను 5 గ్రా ఒక లీటర్ కి కలిపి విత్తన శుద్ధి చేయడము వలన, నేల ద్వారా సంక్రమించే శిలీంధ్ర వ్యాధులను నివారించడంతో పాటు మొక్కల ఆరోగ్యకరమైన మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు జేత శ్రీనివాస్, బోష్, రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్ కు చక్రాల కుర్చీ అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్.

..వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం చక్రాల కుర్చీ అందించాం: లయన్స్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ.

..లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ డీఎం మాధవి లత.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 04:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల ఆర్ టి సి బస్టాండ్ లో దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం చక్రాల కుర్చీ అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లతకు వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం సహకారం అందిస్తామని అన్నారు. గత వారం రైల్వే స్టేషన్ కు రెండు చక్రాల కుర్చీలు అందజేశామని గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు మాట్లాడుతూ 2025- 26 సంవత్సరంలో దాదాపు 200 సేవా కార్యక్రమాలు నిర్వహించామని చివరి కార్యక్రమం గా దివ్యాంగులకు, వృద్ధులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేయడం సంతోషాన్ని కలిగించింది అన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వీల్ చైర్ అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కిషోర్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఉదయ భాస్కర్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డీ.కే. మూర్తి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సుబ్బరాజు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎం.పీ.వి.రమణయ్య, నూతన అధ్యక్షులు గా ప్రమాణ స్వీకారం చేయనున్న సందీప్, సీనియర్ సభ్యులు యూసఫ్ పాల్గొన్నారు.

# వైవీయూ జన్యు శాస్త్ర పరిశోధక విద్యార్థి షేక్ బాబుల్లాకు డాక్టరేట్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 04:**



యోగి వేమన విశ్వవిద్యాలయం, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి షేక్ బాబుల్లా కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ (పీహెచ్.డి.) పట్టాను ప్రకటించింది. షేక్ బాబుల్లా జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ ఎ. ముని కుమారి పర్యవేక్షణలో "ఫార్ములేషన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ గ్రీన్ సింథసైజ్డ్ మల్టీ-న్యూట్రియెంట్ నానోపార్టికల్ కన్సార్షియా ఫర్ ఎన్‌హాన్స్ ప్లాంట్ గ్రోత్ ఆఫ్ సోలానమ్ లైకోపెర్సికమ్ ఎల్. సి.వి. అర్కా వికాస్ అండ్ ఫైటోపాథోజెన్ ఇన్హిబిషన్." అనే అంశంపై పరిశోధన నిర్వహించి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ పరిశోధనలో హరిత పద్ధతిలో సంశ్లేషణ చేసిన బహుళ-పోషక నానోపార్టికల్ కన్సార్షియాను అభివృద్ధి చేసి, టమాటా పంటలో మొక్కల పెరుగుదలను మెరుగుపరచడంతో పాటు వృక్ష రోగకారకాల నియంత్రణలో వాటి ప్రభావాన్ని అధ్యయనం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి మార్గదర్శకాల మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు మరియు వైవా-వోస్ కమిటీ సిఫారసుల ఆధారంగా షేక్ బాబుల్లా డాక్టరేట్ పట్టాకు అర్హులని నిర్ధారించింది. ఈ మేరకు యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు పీహెచ్.డి. నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. షేక్ బాబుల్లా రాసిన పరిశోధన పత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు మిత్రులు షేక్ బాబుల్లాను అభినందించారు.

# ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి ఫ్యాప్టో వినతి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 04:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ఈరోజు నంద్యాలలోని వారి క్యాంపు కార్యాలయంలో 'ఫ్యాప్టో' (ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. విద్యా హక్కు చట్టం-2009 మరియు ఎన్.సి.టి.ఇ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని, అయితే సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో ఇన్-సర్వీస్ టీచర్లు కూడా టెట్ పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీనివల్ల సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కావున, ఉపాధ్యాయుల ప్రయోజనాల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23(1) ని సవరించేలా చొరవ చూపాలని వారు మంత్రి ఫరూక్ ని కోరారు. అలాగే, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్ పరీక్షను నిర్వహించాలని, ఇందులో 40 శాతం అర్హత మార్కులు ఉండేలా మరియు వారి బోధనాంశాల ఆధారంగా సిలబస్ రూపొందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను సావధానంగా విన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారు ఉపాధ్యాయుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, ఈ అంశంపై సానుకూల నిర్ణయం కోసం సంబంధిత ఉన్నతాధికారులతో చర్చిస్తానని మరియు ప్రభుత్వం తరపున తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నంద్యాల జిల్లా సెక్రటరీ దస్తగిరి, చైర్మన్ రామ చంద్రారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ పి. వి. ప్రసాద్, శ్రీనివాసులు, చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఉర్దూడిఐ అస్మద్దీన్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి, కో-చైర్మన్లు కె.నరహరి , చిట్టెటి రమేష్ , చందోలు వెంకటేశ్వర్లు , కె.ప్రకాశరావు , డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎన్.వెంకటేశ్వర్లు , కె.బసవ లింగారావు , గుత్తా శ్రీనివాసరావు , కోశాధికారి చింతల సుబ్బారావు , కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ , డి.మధుసూదనరావు , మరియు ఎం.ప్రవీణ్ కిరణ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి.

.అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సీఎం కార్యక్రమానికి హాజరు కావాలి.

..అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలి.

..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 4:**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన బనగానపల్లె మండలంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేయనున్న సందర్భంగా సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, ఈనెల 9వ తేదీన బనగానపల్లెలో సీఎం కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు, మరియు వివిధ శాఖలలో జరుగుతున్న ప్రగతిపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ..ఈనెల 9వ తేదీన బనగానపల్లెలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేసి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సీఎం పర్యటనకు రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రజలు విచ్చేయనున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలో జరుగుతున్న ప్రగతికి సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని సీఎం కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సీఎం కార్యక్రమంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. నంద్యాల జిల్లాలో ముఖ్యంగా పెన్షన్ల పంపిణీ, వైద్య ఆరోగ్యం, గ్రౌండ్ వాటర్, ఉద్యానవన సాగు, హ్యాండ్లూమ్స్, రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్, డ్వామా, ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం తదితర అంశాలలో సీఎం అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పే విధంగా పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన ఏనెగటివ్ రక్తాన్ని ఏడోసారి దానం చేసి ప్రాణాన్ని కాపాడిన దివ్యాంగుడు.

-గుర్రం శ్యామ్‌కుమార్‌కు ఘనాభినందనలు.

- భారత్ వికాస్ పరిషత్ & ఆయుష్ యోగా సేవా సమితి అధ్యక్షులు కండే ఆనంద్ గురూజీ

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 04:**

విజయా బ్లడ్ బ్యాంక్‌లో రక్తహీనతతో బాధపడుతున్న ఒక మహిళకు అత్యవసరంగా అవసరమైన అత్యంత అరుదైన ఏనెగటివ్ రక్తాన్ని వికలాంగుడైన గుర్రం శ్యామ్‌కుమార్ స్వచ్ఛందంగా దానం చేసి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటివరకు ఆయన ఏడు సార్లు రక్తదానం చేసి పలువురి ప్రాణాలను కాపాడడంలో భాగస్వామి కావడం నిజంగా అభినందనీయం.

ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ , ఆయుష్ యోగా సేవా సమితి అధ్యక్షులు కండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ, "శారీరకంగా వికలాంగుడైనా, గుర్రం శ్యామ్‌కుమార్ మానసికంగా ఎంతో గొప్ప వ్యక్తి. శరీరంలో ఒక అవయవ లోపం ఉన్నా, మనసులో సేవాభావం, దయ, మానవత్వం నిండుగా ఉన్నాయి. ఈ రోజుల్లో సంపూర్ణ ఆరోగ్యంతో, అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న ఎంతోమంది రక్తదానం చేయడానికి ముందుకు రావడం లేదు. అలాంటి పరిస్థితిలో శ్యామ్‌కుమార్ ఏడుసార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి



సమాజానికి ఆదర్శంగా నిలవడం నిజంగా ప్రశంసనీయమైన విషయం. వికలాంగత్వం శరీరానికే పరిమితం, సేవా సంకల్పానికి కాదు అనే విషయాన్ని ఆయన తన కార్యాచరణతో నిరూపించారు" అని కొనియాడారు. అలాగే గుర్రం శ్యామ్‌కుమార్ టెట్ పరీక్ష రాయడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సద్దాం , బాబా ఆనంద్ గురూజీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆనంద్ గురూజీ, శ్యామ్‌కుమార్‌కు టెట్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, పరీక్షకు వెళ్లి రావడానికి అవసరమైన ప్రయాణ ఖర్చులను కూడా తానే భరిస్తానని ప్రకటించారు. అంతేకాకుండా, ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఇతర వికలాంగులు కూడా తన దృష్టికి వస్తే, వారికి తమ వంతు ఆర్థిక సహాయం అందించి వారి విద్య, ఉద్యోగ లక్ష్యాలకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఈ మంచి విషయాన్ని ఆనంద్ గురూజీ దృష్టికి తీసుకువచ్చిన సద్దాం , బాబాలను కూడా ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో అవసరమైన వ్యక్తులను గుర్తించి, వారికి సహాయం అందేలా చేయడం కూడా గొప్ప సామాజిక సేవేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ ప్రజలకు పిలుపునిస్తూ, "గుర్రం శ్యామ్‌కుమార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. రక్తదానం చేయడం అంటే ఒకరి ప్రాణాలను కాపాడడమే. వికలాంగుడైన శ్యామ్‌కుమార్ చూపిన సేవాస్ఫూర్తి ప్రతి సకలాంగునిలో ఉండాలి. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ కనీసం సంవత్సరానికి ఒకసారి అయినా స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి తమ వంతు సేవ చేయాలి. రక్తదానం మహాదానంఢ ఒక యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని నిలబెడుతుంది" అని విజ్ఞప్తి చేశారు. గుర్రం శ్యామ్‌కుమార్ చేసిన ఈ సేవ సమాజానికి ఒక స్ఫూర్తిదాయక సందేశం. ఆయన సేవాభావం మరెందరికో ప్రేరణగా నిలిచి, స్వచ్ఛంద రక్తదాన ఉద్యమానికి ఊతమివ్వాలని, మరెందరో యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని భారత్ వికాస్ పరిషత్, ఆయుష్ యోగా సేవా సమితి మరియు విజయా బ్లడ్ బ్యాంక్ ఆకాంక్షించాయి

# స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఈ నెల 31 న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి.

ఆశావర్కర్లకు కనీసవేతనాలు చెల్లించాలి.

..డి ఎం హెచ్ ఓ ను కలిసిన ఆశావర్కర్ల యూనియన్ నాయకులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 04:**

స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఈ నెల 31 న కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాల్లో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ ) రాష్ట్ర అధ్యక్షురాలు జి.రమణ కుమారి పిలుపునిచ్చారు. శనివారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ )ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు రమణ కుమారి నాయకత్వంలో ప్రతినిధి బృందం జిల్లా వైద్యాధికారి డా ఆర్ వెంకటరమణ ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 31 న జరిగే స్కీమ్ వర్కర్ల ఆందోళనలో ఆశా వర్కర్లు కూడా పాల్గొంటున్నారని డి



ఎం హెచ్ ఓ కు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు జి.రమణ కుమారి మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీసవేతనాలు చెల్లించి,అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, మట్టి ఖర్చులు ఇవ్వాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, శిక్షణ పొందిన ఎఎన్ఎం, జిఎన్ఎం లకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు కనీస వేతనాలు పెంచి 7 సంవత్సరాలు దాటినా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశావర్కర్ల్కు వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశావర్కర్లకు సెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలౌతున్నారన్నారు.. అంగన్వాడీలకు అమలవుతున్న అన్ని రకాల సెలవులు (వేసవి శెలవులు మినహా) ఆశావర్కర్లుకు ప్రభుత్వం చెల్లించే 10 వేలలో నెలలో పిహెచ్సి లకు ఆసుపత్రులకు వెళ్ళడానికి 3,4 వేలు ఖర్చులవుతున్నాయన్నారు సంబంధంలేని పనులు చేయించడం, అధిక జనాభాలో పనిచేయటం వలన ఆశావర్కర్స్ తీవ్ర పని ఒత్తిడికి గురై అనారోగ్యంపాలౌతున్నారని డిమ్ హెచ్ ఓ కు వివరించారు. ఆశావర్కర్స్ సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.డి ఎం హెచ్ ఓ కు వినతిపత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర అధ్యక్షురాలు రమణ కుమరి తోపాటు జిల్లా నాయకురాళ్లు లలితమ్మ, శిరోమణి పీహెచ్సీ లీడర్లు మద్దమ్మ వసంతమ్మ నయోమి తదితరులు ఉన్నారు.

# నూనెపల్లె మార్కెట్ యార్డ్ పరిరక్షణకై ప్రత్యక్ష పోరాటం.

.జులై 18 న నంద్యాలలో సత్యాగ్రహ దీక్ష.

రాయలసీమ సాగునీటి సాధన సమితి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 04:**

నూనెపల్లె మార్కెట్ యార్డ్ కు సంబంధించిన భూమిలో రెండు ఎకరాలను తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకుని మార్కెట్ యార్డ్ ను పరిరక్షించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. మార్కెట్ యార్డు పరిరక్షణ కోసం శనివారం నంద్యాల శివారులోని ఒక ప్రైవేటు స్థలంలో సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బొజ్జా దశరథరామిరెడ్డి, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ..మార్కెట్ యార్డు స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ఇప్పటికే భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చారనీ, అలాగే సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి నేతృత్వంలో ప్రజా



సంఘాలు న్యాయశాఖామాత్యులు ఎన్ .ఎం.డి.ఫరూఖ్ కూడా మార్కెట్ యార్డును కాపాడాలని కోరినప్పటికీ నేటికి కూడా ప్రభుత్వం నుంచి ఏ స్పందన రాకపోవడం విచారకరమని అన్నారు. రైతాంగానికి ఎంతో ఉపయోగపడే మార్కెట్ యార్డును రాజకీయ పార్టీలకు కేటాయించడాన్ని ఆక్షేపిస్తూ ఇది అధికార భూ ఆక్రమణగా సమావేశం వర్ణించింది.

ఈ నేపథ్యంలో ప్రజా, ప్రభుత్వ ఆస్తులను, మార్కెట్ యార్డును పరిరక్షించుకోవడానికి ప్రజలతో కలిసి భవిష్యత్తు కార్యాచరణను నిర్వహించాలని సమావేశం అభిప్రాయపడింది. ఇందులో భాగంగా జులై 18 వ తేదీన నంద్యాల పట్టణంలో పెద్దఎత్తున సత్యాగ్రహ దీక్ష చేపట్టాలని సమావేశం తీర్మానించింది. ప్రజల ఆస్తుల పరిరక్షణకు ప్రజలంతా సంఘటితం కావలసిన సమయం ఆసన్నమైందని ప్రజలు ఈ సత్యాగ్రహ దీక్షకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, ప్రముఖ న్యాయవాది శంకరయ్య, ఏరువ రామచంద్రారెడ్డి, మహర్షి వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పులికొండన్న, ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు సోమన్న

ఎస్ ఆర్ బి సి పరిరక్షణ నాయకులు మురళీధర్ రెడ్డి, జాతీయ బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ చింతలయ్య, రైతునగరం క్రిష్ణారెడ్డి, క్రిష్టియన్ జెఏసి నాయకులు జానయ్య, శివకుమార్ రెడ్డి, జానోజాగో నాయకులు మహబూబ్ భాష, మనోజ్ కుమార్ రెడ్డి, న్యాయవాది అసదుల్లా, నూనెపల్లె మురళి, భాస్కర్ రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ఎల్ నినో ముప్పు.. ఆరుతడి ముద్దు.!

**- వరి సాగును తగ్గించుకోవాలి. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి**

**-వాతావరణ పరిస్థితులపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి.**

**-నంద్యాల ఆర్ఏఆర్ఎస్ సదస్సులో ఆచార్య ఎన్.జి.రంగా వర్సిటీ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 04:**
రానున్న జూలై, ఆగస్టు నెలల్లో ఎల్ నినో ప్రభావం అత్యధికంగా ఉండే అవకాశం ఉన్నందున, రైతులు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి సాగును తగ్గించి ఆరుతడి (మెట్ట) పంటల వైపు మొగ్గుచూపాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లో అల్ప వర్షపాత మండలం, దక్షిణ మండలం ఆధ్వర్యంలో 'ఎల్ నినో పై అవగాహన మరియు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.
శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు ఆదర్శ రైతులు సమన్వయంతో పని చేయాలని వీసీ సూచించారు. ప్రతి వారం ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులను సమీక్షించుకుంటూ తగిన కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు వాతావరణ హెచ్చరికలు, సలహాలు అందించాలని ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం: డా. సుమతి**
సదస్సుకు అధ్యక్షత వహించిన పరిశోధనా సంచాలకులు డా. వి. సుమతి మాట్లాడుతూ.. వర్షపాతం తక్కువగా నమోదయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేయాలన్నారు. ఎల్ నినోను ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు ఆమె స్పష్టం చేశారు.
అనంతరం హైదరాబాద్ క్రీడా ప్రధాన శాస్త్రవేత్త డా. ఏ.వి. ఎం .సుబ్బారావు మాట్లాడుతూ.. ఎల్ నినో చారిత్రక అంశాలు, 2026 సంవత్సరానికి సంబంధించిన వాతావరణ అంచనాలు, వ్యవసాయ వ్యూహాలను వివరించారు. తిరుపతి అర్.ఏ.అర్.ఎస్ ప్రధాన శాస్త్రవేత్త



(అగ్రోనమీ) డా. టి ప్రతిమ మాట్లాడుతూ, దక్షిణ మండలానికి సంబంధించిన రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో ఎల్ నినో వల్ల జరిగే నష్టం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అల్ప వర్షపాత మండలం ప్రధాన శాస్త్రవేత్త డా. జి. నారాయణ స్వామి వర్షపాత వివరాలను, ప్రత్యామ్నాయ ప్రణాళికలను సదస్సు దృష్టికి తెచ్చారు. సదస్సులో చర్చించిన అంశాలను రైతులు తప్పక పాటించేలా కృషి చేయాలని నంద్యాల ఆర్.ఏ.అర్.ఎస్ సహ పరిశోధనా సంచాలకులు డా. వి.జయలక్ష్మి కోరారు.

## మైనారిటీ యువతకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి

**విజయవాడలో భారీ 'మెగా జాబ్ మేళా'**

**రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 04:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా, మైనారిటీ సంక్షేమ శాఖ మరియు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న విజయవాడలోని ముసాఫిర్ ఖానా (పంజా సెంటర్)లో భారీ 'మెగా జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మరియు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. నంద్యాలలోని మంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనారిటీ యువత నిరుద్యోగులుగా ఉండకూడదనే ఉద్దేశంతో, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో మైనారిటీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో సుమారు 60 నుండి 70 ప్రముఖ కంపెనీలను ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నట్టు తెలిపారు. గత ఐదేళ్ల వైస్సార్సీపీ పాలనలో నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉపాధి కల్పించని గత ప్రభుత్వం, నేడు అనవసర విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం అందేలా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను యువత అందిపుచ్చుకోవాలని కోరారు. జులై 11న నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో హాజరై, తమకు లభించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 18 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై

# రామకృష్ణ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 04:**
నంద్యాలలోని స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ( ఎం.బి.ఏ. 2006 – 2008) బ్యాచ్ విద్యార్థుల "మహా పునర్మిళనం" కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. 18 సంవత్సరాల క్రితం ఇదే కళాశాలలో కలిసి విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా మరోసారి ఒకే వేదికపై కలుసుకునేందుకు "ది గ్రాండ్ రీయూనియన్ మరపురాని 18 సంవత్సరాల అనంతరం" పేరుతో ఈ ఆత్మీయ కలయికను నిర్వహించారు. ఈ వేడుకను సంప్రదాయబద్ధంగా 'వందేమాతరం' గీతాలాపనతో ప్రారంభించారు.

**బి. రవికృష్ణ స్వాగత ప్రసంగం:**
కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ బి. రవికృష్ణ స్వాగతం పలుకుతూ భావోద్వేగ భరితంగా మాట్లాడారు. "ఈ రోజు మనమంతా ఇక్కడ కలవడం ఒక మధురమైన అనుభూతి. శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల కేవలం చదువును మాత్రమే చెప్పలేదు, మన జీవితాల విజయానికి ఒక బలమైన పునాది వేసింది. 18 ఏళ్ల క్రితం విద్యార్థులుగా ఉన్నప్పుడు మనలో ఉన్న వేదిక భయాన్ని (స్టేజ్ ఫియర్) తొలగించి, సమాజంలో ఆత్మవిశ్వాసంతో మాట్లాడే ధైర్యాన్ని, సంస్కారాన్ని నేర్పింది ఇదే వేదిక, ఇదే డయాస్, ఇదే పోడియం. నా వృత్తి జీవితంలో నేను ఈ స్థాయికి చేరుకోవడానికి సరైన దిశానిర్దేశం చేసి, నిరంతరం మార్గనిర్దేశనం చేసిన పూజ్యులు రామకృష్ణుడు సార్ కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను."

**శ్రీ కృష్ణుడు ప్రసంగం:**
ఒకప్పటికళాశాల అధ్యాపకులు, ప్రస్తుత శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ అధ్యాపకులు శ్రీ కృష్ణుడు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను చూసి ఎంతో ఆనందించారు. "నా విద్యాబోధన ప్రయాణంలో డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి సారు నాకు ఎల్లప్పుడూ కొండంత అండగా నిలిచారు. ఆ సమయంలో విద్యార్థుల క్రమశిక్షణ, బాధ్యతల విషయంలో సార్ నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. గురువుగా విద్యార్థులైన మీతో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఆ రోజుల్లో మీరు చేసిన అల్లరి, పనులు, చదువుపై చూపిన శ్రద్ధ... మిమ్మల్ని ఈ రోజు ఇంతటి ఉన్నత స్థానాల్లో చూస్తుంటే అవన్నీ మళ్లీ నా కళ్లముందు కదలాడుతున్నాయి. మిమ్మల్ని 18 ఏళ్ల తర్వాత ఇలా ఒకే వేదికపై చూడటం నాకు మాటల్లో చెప్పలేనంత సంతోషాన్ని ఇస్తోంది. మీ అందరిపై నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి."

**డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి ముఖ్య సందేశం:**
కళాశాల అధినేత, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ సుదీర్ఘ సందేశాన్ని ఇచ్చారు. "మిమ్మల్ని అందరినీ ఇన్నేళ్ల తర్వాత ఒకే చోట చూడటం నాకెంతో ఆనందంగా ఉంది. కాలం చాలా వేగంగా మారిపోయింది. 18 సంవత్సరాల క్రితం యవ్వనంలో ఉన్న మీ రూపాలకు, కుటుంబ బాధ్యతలతో పరిణతి చెందిన మీ ప్రస్తుత రూపాలకు చాలా తేడా వచ్చింది. అందుకే మిమ్మల్ని చూడగానే మొదట ఎవరిని ఎవరో కూడా వెంటనే గుర్తుపట్టలేకపోయాను. అయితే, జీవితంలో విజయం సాధించి ఇక్కడితోనే ఆగిపోవద్దు. మనం కేవలం గూగుల్ లో సమాచారం వెతుక్కునేందుకే పరిమితం కాకూడదు. మన పిల్లల కోసం, రాబోయే తరం కోసం, సమాజం కోసం మన జ్ఞానాన్ని, అనుభవాన్ని పంచుకోవాలి. నిరంతరం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రస్తుత విద్యార్థులకు సరైన మార్గదర్శకులుగా నిలవాలి. గుర్తుపెట్టుకోండి... మనం సంపాదించిన జ్ఞానం ఎప్పటికీ వృథా కాదు; దాన్ని ఇతరులకు పంచుతున్న కొద్దీ మన జ్ఞానం మరింత పెరుగుతుంది. విద్యా రంగంలో సంస్కరణలు ఎంత ముఖ్యమో చెప్పడానికి ఒక ఉదాహరణ... ప్రస్తుతం సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సుమారు 6,00,000 గురుకులాలు, 72 విశ్వవిద్యాలయాలు, 1,830 ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు విస్తరించి విద్యా సేవలు అందిస్తున్నాయి. సమాజ శ్రేయస్సు కోసం, దేశ ప్రగతి కోసం అహర్నిశలు కష్టపడే వ్యక్తులకు మనం ఎల్లప్పుడూ అండగా నిలవాలి. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు మీ అందరికీ నా ధన్యవాదాలు."

**గురువందనం సన్మాన కార్యక్రమం**
ఉపన్యాసాల అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి తమ గురువుల పట్ల




కృతజ్ఞతను చాటుకున్నారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి నీ, అలాగే తమకు పాఠాలు బోధించిన ప్రియతమ అధ్యాపకులు లిలికృష్ణుడు సార్ కు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం, కళాశాల యాజమాన్యం తరపున పూర్వ విద్యార్థులందరికీ ఈ మధుర స్మృతికి గుర్తుగా ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు. పాత స్నేహితులు, గురువులతో కలిసి దిగిన గ్రూప్ ఫొటోలతో ఈ మహా పునర్మిళన వేడుక అత్యంత సంతోషకరమైన వాతావరణంలో ముగిసింది.










